సాక్షి ఒడిశా

శుక్రవారం । 6 । జూన్ । 2025



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం గురువారం లెక్కించారు. ఇందులో నగదు రూ.5,15,405లు, బంగారం 22గ్రాముల 700 మిల్లీగ్రాములు, వెండి 54గ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.

భువనేశ్వర్-విశాఖపట్నం మధ్య విమానయాన సౌకర్యం

భువనేశ్వర్: స్థానిక బిజూ పట్నాయక్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి విశాఖపట్నంకు ప్రత్యక్ష విమానయాన సౌకర్యం అందుబాటులోకి రానుంది. ఈ మేరకు అధికారిక ప్రకటన జారీ కాకున్నా.. అనుబంధ వెబ్‌సైటులో టికెట్ల బుకింగు కొనసాగుతోంది. ఈ సమాచారం ప్రకారం ఈ నెల 12వ తేదీ నుంచి భువనేశ్వర్, విశాఖపట్నం మధ్య ఇండిగో విమాన సేవలు ప్రారంభం కానున్నట్లు స్పష్టం అవుతుంది. ఈ రెండు ప్రాంతాల మధ్య విమానయానం నిడివి 1 గంట 20 నిమిషాలు. మధ్యాహ్నం 12.35 గంటలకు స్థానిక బిజూ పట్నాయక్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి బయల్దేరి మధ్యాహ్నం1.55 గంటలకు విశాఖపట్నం చేరుతుంది. ప్రస్తుతం ఈ రెండు ప్రాంతాల మధ్య ప్రయాణ చార్జీ రూ. 3,874గా వెబ్‌సైటు సమాచారం . చెన్నై, బెంగళూరు, కొచ్చి, హైదరాబాద్ తర్వాత ఒడిశా రాజధాని నుంచి అనుసంధానించిన 5వ దక్షిణ భారత నగరంగా విశాఖపట్నం నిలుస్తుంది.

న్యూస్‌రీల్

హాస్టల్ ఏర్పాటు చేయాలి



మంత్రి గొండొకు వినతిపత్రం అందజేస్తున్న రజత్ మదల తదితరులు

రాయగడ: జిల్లాలోని కాసీపూర్ సమితి పరిధి మునుష్గా పంచాయతీలోని కొడిగుడ గ్రామంలో ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల సౌకర్యార్థం హాస్టల్ ఏర్పాటు చేయాలని బీజేపీ సీనియర్ నాయకుడు రజత్ మదల కోరారు. ఈ మేరకు కార్యకర్తలతో కలిసి రాజధానికిలోని రాష్ట్ర ఆదివాసీ, హరిజన వెనుకబడిన వర్గాల సంక్షేమ శాఖ మంత్రి నిత్యానంద గొండొకు గురువారం వినతి పత్రం అందజేశారు. కాసీపూర్ సమితిలో విద్యావిధానం మరింత మెరుగుపరచాలని, అదేవిధంగా ఆస్పత్రి సౌకర్యాలు కల్పించాలని కోరారు.

ప్రయాణికునికి ఫోన్ అప్పగింత



ఫోన్ అప్పగించిన టీటీఈ

భువనేశ్వర్: హౌరా నుంచి సికింద్రాబాద్ వెళ్తున్న ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్‌లోని ఎయిర్ కండిషన్డ్ బోగీలో ప్రయాణికుడు మరిచిపోయిన ఫోనుని భద్రంగా సంబంధీకులకు అప్పగించి టికెటు తనిఖీ సిబ్బంది సేవా భావం చాటుకున్నాడు. హౌరా నుంచి ఖుర్దా రోడ్ వరకు టికెటు తనిఖీ విధులు నిర్వహించిన చీఫ్ టికెట్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీధర మహంతి సత్వర స్పందనతో ఇది సాధ్యమైంది. ఎం-4 ఎయిర్‌కండిషన్ బోగీలో ప్రయాణించి వ్యక్తి విలువైన మొబైల్ ఫోను మర్చిపోయి జాజ్‌పూర్ కెంజొహర్ రోడ్ రైల్వే స్టేషనులో దిగిపోయాడు. రైలు బయల్దేరిపోవడంతో రైల్వే శాఖ సహకారంతో టికెటు తనిఖీ అధికారికి సమాచారం చేరదీయడంతో విధి నిర్వహణలో ఉన్న అధికారి తక్షణమే గాలించి ఆ వ్యక్తి ప్రయాణించిన సీటులో మొబైలు ఫోన్ గుర్తించి తెలియజేయడంతో తదుపరి రైల్వే స్టేషన్‌లో ఫోను మరిచిపోయిన ప్రయాణికుని బంధువు కటక్ రైల్వే స్టేషన్‌కు చేరి సంబంధిత చీఫ్ టికెట్ నుంచి మొబైల్ ఫోను తిరిగి పొందగలిగాడు.

వివాహిత దారుణ హత్య



హత్యకు లోనైన రుక్మిణీ పెంటియ

జయపురం: కామంతో కళ్లు మూసుకుపోయిన ఓ యువకుడు పిన్ని వరుస మహిళను కామించి ఆమె నిరాకరించటంతో హత్య చేసిన ఉదంతం వెలుగు చూసింది. ఈ సంఘటన జయపురం సబ్‌డివిజన్ బొరిగుమ్మ పోలీసు స్టేషన్ పరిధి జయంతగిరి-మినాగుడ మార్గంలో బుధవారం జరిగింది. పోలీసులు నిందితుడిని అరెస్టు చేసి విచారిస్తున్నారు.
మినాగుడ గ్రామం డొంబు పెంటియ తనకు పిన్ని వరుస అయిన రుక్మిణీ పెంటియపై కన్నువేశాడు. శారీరక సంబంధం కోసం ఆమెను వేధించసాగాడు. బుధవారం రుక్మిణీ పెంటియ జయపురంలో బంగారు నగలు కొనేందుకు బయల్దేరింది. విషయం తెలుసుకున్న డుము పెంటియ జయంతిగిరి-మినాగుడ మార్గంలో ఆమెను అడ్డగించాడు. డొంబు కోరికను ఆమె నిరాకరించడంతో అతడు కోపంతో కత్తితో ఆమె కడుపులో పొడిచాడు. తీవ్ర రక్తస్రావమై ఆమె పడిపోయింది. స్థానికులు గమనించి ఆమెను కొరాపుట్ సహిద్ లక్ష్మణ నాయిక్ వైద్య విద్యాలయ ఆస్పత్రిలో చేర్చారు. ఆమె అక్కడ చికిత్స పొందుతూ చనిపోయింది. రుక్మిణీ కుటుంబ సభ్యులు ఈ ఘటనపై బొరిగుమ్మ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి నిందితుడిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు బొరిగుమ్మ పోలీసు అధికారి శ్వేత పద్మ సెట్టి వెల్లడించారు. రుక్మిణీ భర్త మానసిక రోగి కావటం వల్ల, ఆ అవకాశాన్ని తీసుకొని ఆమెను తన వశం చేసుకోవాలని డొంబు పెంటియ ప్రయత్నించి విఫలమై ఈ హత్యకు పాల్పడ్డాడని పోలీసు అధికారి తెలిపారు.

శోకానికి.. కారణమెవరు..?



వైద్య కళాశాలలో పర్యటిస్తున్న మంత్రి ముఖేష్, కలెక్టర్, ఎమ్మెల్యేలు



రోగుల బంధువుల యోగక్షేమాలు అడిగి తెలుసుకుంటున్న మంత్రి



మందుల కౌంటర్లో మందులు పరిశీలిస్తున్న మంత్రి

- కొరాపుట్ వైద్య కళాశాలలో.. నాయకుల పర్యటన

కొరాపుట్: కొరాపుట్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ సాహిద్ లక్ష్మణ్ నాయక్ కళాశాలలో వైద్యం వికటించి ఆరుగురు మృతి చెందారు. గురువారం రాష్ట్ర వైద్య మంత్రి ముఖేష్ మహాలింగ అత్యవసర పర్యటన చేశారు. రాజధాని నుంచి ఆగమేఘాల మీద వైద్య కళాశాలకు తరలి వచ్చారు. మంత్రి వస్తున్నారని తెలిసి కాంగ్రెస్ పార్టీ నాయకులు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. దాంతో ప్రభుత్వం పెద్ద ఎత్తున రక్షణ కల్పించింది. ఆస్పత్రి ప్రధాన ద్వారం వద్ద మంత్రితో కాంగ్రెస్ మాజీ ఎమ్మెల్యే నిమయ్ సర్కార్ మాట్లాడానికి ప్రయత్నం చేశారు. ఇది గమనించిన బీజేపీకి చెందిన కొరాపుట్ ఎమ్మెల్యే రఘురాం మచ్చో దాడికి ప్రయత్నించారు. నిమయ్ అప్రమత్తమై ఎమ్మెల్యేపై ఎదురు దాడికి దిగారు. అప్రమత్తమైన భద్రతా సిబ్బంది ఇద్దరిని విడదీశారు. అనంతరం మంత్రి వైద్య కళాశాలలో వివిధ వార్డులు సందర్శించారు. రోగులకు అందుతున్న చికిత్స అడిగి తెలుసుకున్నారు. మందుల కౌంటర్ ని పరిశీలించారు. కళాశాలలో ఉన్నత స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. అసలు మరణాలు ఎలా జరిగాయని ప్రశ్నించారు. సమావేశంలో కలెక్టర్ వీ.కీర్తి వాసన్, కొట్ పాడ్ ఎమ్మెల్యే రుపుధర్ బోత్ర తదితరులు పాల్గొన్నారు.

విచారణ జరిపిస్తున్నాం: మంత్రి ముఖేష్

ఇలాంటి మరణాలు విచారకరమని రాష్ట్ర వైద్య మంత్రి ముఖేష్ మహాలింగం ప్రకటించారు. వైద్య కళాశాల ఆవరణలో మీడియాతో మాట్లాడారు. ఈ ఘటనపై ప్రభుత్వ విచారణ జరుగుతుందన్నారు. తాను ఆస్పత్రిలో అన్ని వార్డులు పరిశీలించానన్నారు. పూర్తిస్థాయి సమీక్ష జరిగిందని మంత్రి ప్రకటించారు.

వైద్య బృందం పరిశీలన..

ఘటనపై పూర్తిస్థాయి విచారణకు ప్రభుత్వం ఆదేశించింది. కటక్, బ్రహ్మపుర వైద్య కళాశాలలకు చెందిన వైద్య నిపుణుల బృందం తరలి వచ్చింది. ఆయా వైద్య నిపుణులు కళాశాలలో తమ విచారణ ప్రారంభించారు. మరో వైపు కాంగ్రెస్ పార్టీకి చెందిన బృందం కళాశాలలో పర్యటించింది. రాష్ట్ర మహిళా కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు మీనాక్షి వాహినిపతి తదితరులు కళాశాలలో వివిధ వార్డుల్లో పర్యటించారు.

రూ.25 లక్షల పరిహారం ఇవ్వాలి..

వైద్య కళాశాల మృతులకు రూ.25 లక్షల చొప్పున పరిహారం ఇవ్వాలని రాష్ట్ర ప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షుడు రామ చంద్ర ఖడం డిమాండ్ చేశారు. గురువారం కొరాపుట్ జిల్లా కేంద్రంలోని ప్రెస్ క్లబ్‌లో మీడియాతో మాట్లాడారు. ఇవి ప్రభుత్వ హత్యలని అన్నారు. బాధిత కుటుంబాల గోడు వినలేదన్నారు. నర్సులు ఇంజెక్షన్ ఇచ్చిన వెంటనే రోగులు చనిపోయారని పేర్కొన్నారు. మంత్రితో మాట్లాడడానికి వచ్చిన తమ పార్టీ మాజీ ఎమ్మెల్యే నిమయ్ సర్కార్ పై స్థానిక ఎమ్మెల్యే దాడి చేయడం సరికాదన్నారు. చేతకాని ప్రభుత్వం ప్రజా ప్రతినిధులపై భౌతిక దాడులు చేస్తుందన్నారు. ఇలాంటి దాడులతో ప్రజలను భయపెట్టలేరనని రాం చంద్ర ఖడం పేర్కొన్నారు.



రోగులను పరామర్శిస్తున్న మంత్రి ముఖేష్



కొరాపుట్ ప్రెస్ క్లబ్‌లో ప్రసంగిస్తున్న పీసీసీ అధ్యక్షుడు రాం చంద్ర ఖడం



మృతుని కుటుంబాన్ని పరామర్శిస్తున్న కాంగ్రెస్ నాయకులు



వైద్య కళాశాల వద్ద కాంగ్రెస్ బృందం పర్యటన

పోలీసుల అదుపులో మేధా పాట్కర్



స్థానిక రైల్వే స్టేషన్‌లో మేధా పాట్కర్‌ను అదుపులోకి తీసుకున్న పోలీసులు



కారులో బరంపురం తరలింపు

రాయగడ: పర్యావరణ వేత్త, ప్రముఖ సమాజ సేవకురాలు మేధా పాట్కర్‌ను రాయగడ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆమెను ప్రత్యేక వాహనంలో బరంపురం తరలించారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా గురువారం ఆమె కాశీపూర్ పరిధి హాటాపాదారాలో జరిగే కార్యక్రమానికి హాజరు కావాలి. గురువారం తెల్లవారున హిరాఖండ్ ఎక్స్‌ప్రెస్‌లో రాయగడ రైల్వే స్టేషన్‌కు చేరుకున్న ఆమెతో పాటు సహచరులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఇప్పటికే అక్కడ పరిశ్రమల ఏర్పాటుకు వ్యతిరేకంగా ప్రజా నిరసనలు జరుగుతున్నాయి. మేధా పాట్కర్ ఆ ప్రాంతానికి వెళ్లి ప్రసంగిస్తే పరిస్థితులు అదుపు తప్పుతాయని భావించి ఆమెను అక్కడకు వెళ్లనీయకుండా అడ్డుకున్నారు. ఆమెతో పాటు పర్యావరణ వేత్త ప్రఫుల్ల సామంత, కృషక్ నాయకుడు లింగరాజ్, నరేంద్ర మహంతి తదితరులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

అభివృద్ధికి వ్యతిరేకిని కాను..

తాను అభివృద్ధికి వ్యతిరేకిని కానని మేధా పాట్కర్ తెలిపారు. సమావేశంలో పాల్గొనేందుకు వెళ్తుంటే పోలీసులు అడ్డుకోవడం సమంజసం కాదన్నారు. శాంతి యుతంగా జరిగే ఇలాంటి కార్యక్రమాల్లో గతంలోనూ పాల్గొన్నానని పేర్కొన్నారు. పోలీసుల అదుపులో ఉన్న మేధా పాట్కర్ తాను ఓ పాత్రికేయుడిని కలవాలని కోరగా.. స్థానికంగా ఉంటున్న ప్రముఖ పాత్రికేయుడు కీర్తి చంద్ర సాహు ఇంటికి తీసుకెళ్లారు. ఆయన ఇంటిలో అల్పాహారం తీసుకున్న తర్వాత తిరిగి పోలీసులు ఆమెను ప్రత్యేక వాహనంలో బరంపురం తరలించారు.

రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వ తొలి వార్షికోత్సవం

- ప్రధాన మంత్రి మోదీ రాక

భువనేశ్వర్: ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి నేతృత్వంలో రాష్ట్రంలో తొలి భారతీయ జనతా పార్టీ ప్రభుత్వ పాలన ఏడాది పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా తొలి వార్షికోత్సవం ఘనంగా నిర్వహించేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. తొలి వార్షికోత్సవానికి భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ హాజరుకానున్నట్లు సమాచారం. ఈ నెల 12న రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం తొలి వార్షికోత్సవం జరగనుంది. ఇటీవల ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి ఢిల్లీ పర్యటన పురస్కరించుకుని రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం తొలి వార్షికోత్సవానికి హాజరు కావాలని భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జె. పి. నడ్డా ఇతర ప్రముఖులను ఆహ్వానించారు. గత ఏడాది రాష్ట్రంలో తొలిసారిగా బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు పురస్కరించుకుని మోహన్ చరణ్ మాఝి ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారోత్సవానికి ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ హాజరైనట్లు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ప్రభాతి పరిడా గుర్తు చేశారు. తొలి వార్షికోత్సవంలో ప్రధానమంత్రి పాల్గొనడం ఒడిశా అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వ మద్దతు, రాష్ట్ర, కేంద్ర పరిపాలనల మధ్య సహకార, సమన్వయతని ప్రతిబింబిస్తుందన్నారు.

విశ్రాంత కార్మికులకు బకాయి బాధ



ఆస్పత్రిలో ఉన్న ముత్యాల రావు

జయపురం: జయపురం గగణాపూర్ సేవా పేపరు మిల్లు విశ్రాంత కార్మికుడు ఆరోగ్య పరిస్థితి ఆందోళనకరంగా మారింది. అతడి కుటుంబ సభ్యులు జయపురం జిల్లా కేంద్రాస్పత్రిలో చేర్చారు. అతడిని పరీక్షించిన వైద్యులు మెరుగైన వైద్యం కోసం మరో చోటకు తీసుకెళ్లాలని సలహా ఇచ్చారు. కానీ అంత ఆర్థిక స్థోమత లేకపోవడంతో వారు ఏం చేయాలో తెలీక తల్లడిల్లుతున్నారు. సేవా యూనియన్ నేత ప్రమోద్ కుమార్ మహంతి వివరిస్తూ.. సేవా పేపరుమిల్లు విశ్రాంత కార్మికుడు బి.ముత్యాల రావు కిడ్నీ వ్యాధితో బాధ పడుతున్నాడని, ముత్యాల రావు కుమారులు తన తండ్రికి రావాల్సిన గ్రాడ్యుటీ, ఇతర బకాయిలు వెంటనే చెల్లించాలని అభ్యర్థించారని, అయితే యాజమాన్యం కేవలం రూ.10వేలు మాత్రమే అందజేసిందన్నారు. రానున్న రెండు నెలల్లో బకాయిలు అందజేస్తామని యాజమాన్యం హామీ ఇచ్చిందని తెలిపారు. కానీ ముత్యాల రావు చికిత్సకు రూ.లక్షల్లో డబ్బు అవసరమవుతుందని, చాలా మంది విశ్రాంత కార్మికులు ఇలాంటి పరిస్థితిని ఎదుర్కొంటున్నారని తెలిపారు. సకాలంలో యాజమాన్యం విశ్రాంత కార్మికులకు బకాయిలు చెల్లించనందున తగిన వైద్యం అందక ఇటీవల 30 మందికి పైగా మరణించారని ఆయన వెల్లడించారు. ఇప్పటికైనా మిల్లు యాజమాన్యం విశ్రాంత కార్మికుల పట్ల మానవతా దృష్టితో తక్షణ సహాయం అందజేయాలని కోరారు. బకాయి ఉన్న డబ్బు వెంటనే చెల్లించి సహకరించాలని కోరారు.

ప్లాస్టిక్ కాలుష్యం తరిమేద్దాం



ప్లాస్టిక్ కాలుష్యం తరిమేద్దామంటూ ప్రఖ్యాత సైకత శిల్పి సుదర్శన్ పట్నాయక్ పిలుపునిచ్చారు. పూరీ సాగర తీరంలో ఆలోచింపజేసే సైకత శిల్పాన్ని తీర్చిదిద్ది ఈ నినాదమిచ్చారు.

– భువనేశ్వర్/పూరీ

పేపర్ మిల్లు పునరుద్ధరణపై సమావేశం



సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే తారాప్రసాద్ తదితరులు



సమావేశంలో పాల్గొన్న కార్మికులు

జయపురం: స్థానిక గగణాపూర్‌లోని సేవా పేపరు మిల్లు పునరుద్ధరణపై జయపురం ఎమ్మెల్యే తారా ప్రసాద్ బాహినీపతి అధ్యక్షతన ఒక సమావేశాన్ని పట్టణంలోని రుతురాజ్ కల్యాణ మండప ప్రాంగణంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మిల్లు పునః ప్రారంభించేందుకు పెట్టుబడులు పెట్టనున్న నూతన యాజమాన్యం త్వరలోనే ఉత్పత్తి ప్రారంభించేందుకు సంసిద్ధత ప్రకటించిందన్నారు. మిల్లులో ఉత్పత్తి సజావుగా జరిపేందుకు రెండు యూనియన్ల కార్మికులతో చర్చలు జరిపారు. యునైటెడ్ అరబ్ ఎమిరేట్సర్ అనే పెట్టుబడులు పెట్టే కంపెనీకి మిల్లు నడిపేందుకు పూర్తిగా సహకరించాలని కోరారు. ఈనెల 25 నాటికి రాష్ట్ర ప్రభుత్వంతో నూతన యాజమాన్యం ఎంవోయూ చేసుకునే అవకాశం ఉందని వెల్లడించారు. అలాగే కార్మికులకు గత 10 నెలల బకాయి వేతనాలు చెల్లించడంతో జూలై నుంచి అందరికీ నిబంధనల ప్రకారం జీతాలు చెల్లించడం జరుగుతుందని పేర్కొన్నారు. సమావేశంలో కంట్రాక్టర్ల ప్రతినిధి నరేంద్ర మహంతి, లాడి శ్రీనివాసరావు, 4వ నంబర్ యూనియన్ ప్రదీప్ కుమార్ రాయ్, సందీప్ మండల్, సునీల్ సాహు, ఉపేంద్ర జెన, 3వ నంబర్ యూనియన్ అధ్యక్షుడు ఉజ్వీన్ నాయిక్, ఉమాశంకర పాణిగ్రహి, సుదర్శన సెట్టి తదితరులు పాల్గొన్నారు.

స్నానోత్సవానికి ప్రత్యేక భద్రతా ఏర్పాట్లు: ఐజీ



సెంట్రల్ ఇన్‌స్పెక్టర్ జనరల్ అధ్యక్షతన పోలీసు అధికారుల ఉన్నత స్థాయి సమావేశం

భువనేశ్వర్: పూరీ శ్రీ జగన్నాథుని రథయాత్రకు 15 రోజుల ముందుగా స్నానోత్సవం జరగనుంది. ఏటా జ్యేష్ఠ పూర్ణిమ పురస్కరించుకుని శ్రీ మందిరం ప్రాంగణంలో భారీ స్థాయిలో ఈ ఉత్సవం నిర్వహిస్తారు. శ్రీమందిరం ప్రహరి మేఘనాథ్ ప్రాంగణంలో బహిరంగ మండపంపై మూల విరాట్లకు స్నానోత్సవం నిర్వహిస్తారు. ఈ ఏడాది జూన్ 11న శ్రీ జగన్నాథుని స్నానోత్సవం జరుగుతుంది. ఈ మేరకు పోలీసు యంత్రాంగం భారీ భద్రతా ఏర్పాట్లు చేస్తోంది. ఈ నేపథ్యంలో గురువారం రాష్ట్ర పోలీసు ప్రధాన కార్యాలయంలో ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించారు. సెంట్రల్ రేంజ్ ఇన్‌స్పెక్టరు జనరల్ (ఐజీ) ఎస్. ప్రవీణ్ కుమార్ ఈ సమావేశానికి అధ్యక్షత వహించారు. పూరీ జిల్లా పోలీసు సూపరింటెండెంటు వినీత్ అగర్వాల్, అదనపు పోలీసు సూపరింటెండెంటు, ఇన్‌చార్జి ఇన్‌స్పెక్టర్ (ఐఐసీ), ఇతర సీనియర్ అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రథ యాత్ర పురస్కరించుకుని శాంతిభద్రతల స్థితిగతుల్ని సమీక్షించారు. ముందస్తు కార్యాచరణ ప్రణాళికపై లోతుగా చర్చించారు. త్వరలో జరగనున్న స్నాన యాత్రలో శాంతిభద్రతల పరిరక్షణతో భక్తుల రక్షణ కోసం ప్రత్యేకంగా పోలీసు బలగాల్ని మోహరించనున్నట్లు కేంద్ర ఐజీ తెలిపారు. ఈ ఉత్సవానికి సమగ్రంగా 70 ప్లాటూన్ల పోలీసు బలగాల్ని మోహరించనున్నారు. 4 మంది పోలీసు సూపరింటెండెంటు హోదా కమాండెంట్లు, 450 మంది ఇతర స్థాయి అధికారుల్ని నియమించనున్నారు. స్నాన యాత్ర సందర్భంగా పూరీ పట్టణంలో ప్రధానంగా యాత్ర ప్రాంగణం పరిసరాల్లో వాహనాల రాకపోకలపై ప్రత్యేక ఆంక్షలు జారీ చేయనున్నారు. తాత్కాలికంగా వాహనాల కదలికని నియంత్రించనున్నట్లు తెలిపారు. ఈ నెల 9న ద్వితీయ సర్వ సభ్య సమావేశం జరగనుంది. రాష్ట్ర న్యాయ మంత్రి పృథ్వీ రాజ్ హరిచందన్ అధ్యక్షతన ఈ సమావేవం జరుగుతుంది. పూరీ రథ యాత్ర ఏర్పాట్లుపై సమగ్రంగా ఈ సమావేశంలో సమీక్షిస్తారు.

క్లుప్తంగా

పాఠశాలల్లో కోవిడ్ నియమావళి అమలు

భువనేశ్వర్: రాష్ట్రంలో కోవిడ్-19 పాజిటివ్ కేసుల నమోదు క్రమంగా పెరుగుతోంది. మరోవైపు వేసవి సెలవులు ముగిసి పాఠశాలలు తెరిచే సమయం దగ్గర పడుతోంది. ఈ నేపథ్యంలో రాష్ట్ర పాఠశాలలు, సామూహిక విద్యా విభాగం అప్రమత్తం అయింది. విద్యార్థులు, ఉపాధ్యాయులు మరియు సిబ్బంది కోవిడ్ సంక్రమణ బారిన పడకుండా నివారణ చర్యల కింద కోవిడ్ – 19 ఆరోగ్య నియమావళిని అమలు చేయనున్నట్లు మంత్రి నిత్యానంద గోండ్ గురువారం ప్రకటించారు. వేసవి సెలవుల తర్వాత పాఠశాలలు తిరిగి తెరవడంతో కోవిడ్ నియమావళి అమలుకు సంబంధించి ఉత్తర్వులు జారీ కానున్నాయి. పాఠశాలల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు మరియు సిబ్బంది కోవిడ్ – 19 భద్రతా చర్యలను పాటించాల్సి ఉంటుంది. జలుబు వంటి లక్షణాలు ఉన్న విద్యార్థులు మాస్కులు ధరించి పాఠశాలకు హాజరు కావలసి ఉంటుందన్నారు. తీవ్రమైన అనారోగ్య లక్షణాలు ఉన్నవారు ఇంట్లోనే ఉండి హోం క్వారంటైన్ పాటించాలని మంత్రి సలహా ఇచ్చారు.

మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ



మొక్కలు నాటుతున్న గవర్నర్ కంభంపాటి దంపతులు

భువనేశ్వర్: మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని గవర్నర్ డాక్టర్ హరిబాబు కంభంపాటి అన్నారు. గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం పురస్కరించుకుని స్థానిక రాజ్ భవన్ ప్రాంగణంలో గవర్నర్ దంపతులు మొక్కలు నాటారు. కార్యక్రమంలో రాజ్ భవన్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఐఆర్ఎస్‌కు సాయిరాం ఎంపిక



సేనాపతి సాయిరాం

రణస్థలం: సివిల్ సర్వీస్– 2025 ఫలితాల్లో ప్రతిభ కనబరిచిన రణస్థలం మండలం వెల్లురాయి గ్రామానికి చెందిన సేనా పతి సాయిరాం ఇండియన్ రెవెన్యూ సర్వీస్‌కు ఎంపికయ్యారు. ఇతని తండ్రి సూర్యనారాయణ వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. సాయిరాం ఎంపిక కావడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

షేక్ రుక్సాద్‌కు ప్రతిభా అవార్డు



ప్రతిభా అవార్డుతో షేక్ రుక్సాద్

ఇచ్ఛాపురం రూరల్: ఇంటర్మీడియట్ బైపీసీ విభాగంలో ఉత్తమ మార్కులు సాధించిన షేక్ రుక్సాద్‌కు ప్రభుత్వం ప్రతిభా అవార్డు ను గురువారం అందజేసింది. ఈ మేరకు ఎం.తోటూరు ఆది త్యా కళాశాల సిబ్బంది విద్యార్థిని అభినందించారు. విద్యార్థి వెయ్యి మార్కులకు 982 మార్కులు సాధించారు. షేక్ రుక్సాద్ తండ్రి ఇచ్ఛాపురం పట్టణంలో టాక్సీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు.

రెండు తులాల బంగారం చోరీ



చోరీ జరిగిన బీరువాను పరిశీలిస్తున్న పోలీసులు

కొత్తూరు: బలద గ్రామానికి చెందిన కంచరాం పురుషోత్తం ఇంట్లో బుధవారం రాత్రి దొంగలు పడ్డారు. వివాహం నిమిత్తం బంధువుల ఇంటికి వెళ్లి గురువారం ఉదయం వచ్చేసరికి తలుపులు తెరిచి ఉండటంతో చోరీ జరిగినట్లు గుర్తించారు. బీరువా తాళాలు విరగ్గొట్టి అందులో ఉన్న రెండు తులాల బంగారు వస్తువులను పట్టుకుపోయారు. అనంతరం బాధితులు పోలీసులకు సమాచారం అందించారు. సీఐ ప్రసాదరావు, క్లూస్‌టీమ్ గురువారం ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఏఎస్ఐ కేసు నమోదు చేశారు.

పిడుగు పాటుకు ఆవు మృతి

నందిగాం: బడగాం పంచాయతీ కాశీరాజుకాశీపురంలో గురువారం పిడుగు పడి సనపల ముఖలింగంకు చెందిన ఆవు మృతి చెందింది. గ్రామ సమీప పొలాల్లో ఆవును మేతకు తీసుకువెళ్ల ఒక్కసారిగా పిడుగు పడటంతో ఈ ఘటన చోటుచేసుకుంది. వెటర్నరీ అసిస్టెంట్ సునీత ఘటనా స్థలాన్ని పరిశీలించి పశుసంవర్ధక శాఖ ఏడీ రవికృష్ణకు విషయం తెలియజేశారు.

పేకాటరాయుళ్లపై కేసు నమోదు

ఎచ్చెర్ల: లావేరు మండలం బుడుమూరులో పేకాట శిబిరంపై లావేరు పోలీసులు గురువారం దాడి చేశారు. ఐదుగురు పేకాటరాయుళ్లను పట్టుకున్నారు. వారి వద్ద నుంచి రెండు సెల్‌ఫోన్లు, రూ.9,100 నగదు స్వాధీనం చేసుకున్నారు. హెచ్‌సీ హెచ్.జోగారావు కేసు నమోదుచేశారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

మల్కన్‌గిరి:

మల్కన్‌గిరి సమితి తండకి పంచాయతీ బండిగూడలో గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని అటవీ, ఎక్సైజ్, జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా లీగల్ అథారిటీ కార్యదర్శి న్యాయమూర్తి సంగీతా పాత్రో ఈ కర్యక్రమాన్ని ప్రారంభించారు. మొక్కల పెంపకంతో వచ్చే లాభాలు గూర్చి వివరించారు. జిల్లా అటవీశాఖ అధికారి ప్రతాప్ కోత్తపల్లి, మల్కన్‌గిరి ఎక్సైజ్ అధికారి బింబధర్ పండా, మల్కన్‌గిరి అదనపు ఎక్సైజ్ అధికారి టంకధర్ బోయి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

జయపురంలో..

జయపురం: పర్యావరణ పరిరక్షణే సమస్త జీవుల మనుగడకు శ్రీరామ రక్ష అన్నారు పలువురు ప్రముఖులు అన్నారు. గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా జయపురంలో పలు సంస్థలు కార్యక్రమాలు నిర్వహించారు. పలు ప్రాంతాల్లో మొక్కలు నాటారు. స్థానిక ఎం.ఎస్.స్వామినాథన్ రిసెర్చ్ ఫౌండేషన్ కేంద్రం సభాగృహంలో ఒడిశా అటవీ పర్యావరణం, జల వాయు పరివర్తన విభాగం, సహకారంతో ప్రపంచ పర్యావరణ పరిరక్షణ కార్యక్రమం నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి 50 మంది రైతులు పాల్గొన్నారు. స్వామినాథన్ పరిశోధన కేంద్రంలో వివిధ రకాల మొక్కలను నాటారు. జిల్లా జడ్జి, ప్రదీప్ కుమార మహంతి, జయపురం అటవీ విభాగ అధికారి ప్రతాప్ బెహర, జయపురం సబ్‌కలెక్టర్ అక్కవరం శొశ్యా రెడ్డి, సివిల్ జడ్జి శ్రీమతి అలకానంద మహంతి, తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత పాఠశాలలో..

జయపురం ప్రధాన మంత్రి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం పాటించారు. పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు ప్రకాశ చంద్ర పట్నాయక్ పర్యవేక్షణలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో డీఎఫ్ఓ ప్రతాప్ కుమార్ బెహరా, అటవీ రేంజర్ సచ్చిదానంద పారిడ పాల్గొని మొక్కలు నాటారు. పాఠశాల సీనియర్ ఉపాధ్యాయులు విశ్వరంజన్ గౌడ, ప్రభాకర మహరాణ, అరుంధతి త్రిపాఠి, రశ్మితా నాహక్, సంతోషిణి పండా, రజనీ కాంత ఘొడాయి పాల్గొని మొక్కలు నాటారు.

రాయగడలో..

రాయగడ: ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని వివిధ ప్రాంతాల్లో పలు కార్యక్రమాలు జరిగాయి. మున్సిపాలిటీ యంత్రాంగం ఆధ్వర్యంలో పాలిథిన్ వినియోగానికి స్వస్తి పలకాలని గురువారం ర్యాలీ నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ మహేష్ పట్నాయక్, కార్యనిర్వాహక అధికారి కులదీప్ కుమార్, కౌన్సిలర్లు పాల్గొన్నారు. జేసిడి వాకర్స్ క్లబ్, జేకే పేపర్ మిల్ ఉద్యోగులు మొక్కలు నాటారు. అటవీ శాఖ కార్యాలయంలో మొక్కలు నాటారు.

పర్లాకిమిడిలో..

పర్లాకిమిడి: ప్రపంచ పర్యావరణ దినోత్సవం పురస్కరించుకుని జిల్లా అటవీ శాఖ ఆధ్వర్యంలో స్థానిక గుండిచా మందిరం నుంచి ఒక ర్యాలీని జిల్లా కలెక్టర్ బిజయ కుమార్ దాస్ ప్రారంభించారు. ఈ ర్యాలీలో జిల్లా ఎస్పీ జ్యోతింద్రనాథ్ పండా, అబ్కారీశాఖ సూపరింటెండెంట్ ప్రదీప్ కుమార్ సాహు, డీఈఓ డాక్టర్ మయాధర్ సాహు, పురపాలక ఈఓ లక్ష్మణ ముర్ము, పోలీసు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. ర్యాలీ అనంతరం మహేంద్రతనయ వద్ద ఉన్న బృందావన ప్యాలస్‌లో ప్లాస్టిక్ వ్యర్థాలను శుభ్రం చేశారు. జిల్లా అటవీ శాఖ అధికారి కె.నాగరాజు ఆధ్యక్షతన బృందవన ప్యాలస్‌లో జరిగిన సాధారణ సమావేశంలో కలెక్టర్ దాస్, ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రాహి, జిల్లా పరిషత్ చైర్మన్ గవర తిరుపతిరావు తదితరులు పాల్గొని మొక్కలను నాటారు. డి.ఎఫ్.ఓ. కె.నాగరాజు మాట్లాడుతూ ఈ ఏడాది 740 హెక్టార్లలో 3 లక్షల నర్సరీ సాప్లింగ్స్, మరో 5 లక్షల మొక్కలను పంపిణీ చేస్తున్నామన్నారు.



మల్కన్‌గిరి: మొక్కలు నాటుతున్న జిల్లా న్యాయమూర్తి సంగీత పాత్రో



మల్కన్‌గిరి: తండకి వద్దకు పర్యావరణ దినోత్సవానికి హాజరైన అధికారులు



మల్కన్‌గిరి: అటవిశాఖ అధికారి ప్రతాప్ కోత్తపల్లి



జయపురం: ఎం.ఎస్.స్వామినాథన్ రిసెర్చ్ కేంద్రంలో నిర్వహించిన ప్రపంచ పర్యావరణ దినోత్సవంలో పాల్గొన్న జిల్లా జడ్జి, తదితరులు



జయపురం: కార్యక్రమంలో పాల్గొన్న మహిళా రైతులు



జయపురం: మొక్కలు నాటుతున్న అటవీ సిబ్బంది



జయపురం: మొక్క నాటిన జిల్లా జడ్జి



జయపురం: ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మొక్కను నాటుతున్న డీఎఫ్ఓ



రాయగడ: ర్యాలీలో పాల్గొన్న మున్సిపల్ సిబ్బంది, కౌన్సిలర్లు



రాయగడ: మొక్కలు నాటుతున్న జెసిడి వాకర్స్ క్లబ్ సభ్యులు



రాయగడ: మొక్కలు నాటుతున్న జేకే పేపర్ మిల్ ఉపాధ్యక్షుడు వినయ్ ద్వివేది, అధికారులు



రాయగడ: పర్యావరణాన్ని రక్షిస్తున్న వారికి బహుమతులు అందజేస్తున్న అధికారులు



పర్లాకిమిడి: ర్యాలీని ప్రారంభిస్తున్న జిల్లా కలెక్టర్ బిజయ కుమార్ దాస్



పర్లాకిమిడి: ర్యాలీలో పాల్గొన్న ఎక్సైజ్, అటవీ శాఖ సిబ్బంది



పర్లాకిమిడి: బి.ఎన్.ప్యాలస్‌లో ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరిస్తున్న అటవీ సిబ్బంది



పర్లాకిమిడి: బి.ఎన్.ప్యాలస్‌లో మొక్కను నాటుతున్న జిల్లా పరిషత్ చైర్మన్ గవర తిరుపతి రావు

నేటి నుంచి బ్రహ్మోత్సవాలు

రాయగడ: స్థానిక బాలాజీ నగర్‌లోని కల్యాణ వేంకటేశ్వర ఆలయంలో శుక్రవారం నుంచి బ్రహ్మోత్సవాలు ప్రారంభమవ్వనున్నాయి. ఉత్సవాలు ఈనెల 11వ తేదీ వరకు కొనసాగుతాయని ఆలయ ప్రధాన అర్చకులు భాస్కరాచార్యులు తెలియజేశారు. ప్రతిరోజూ ఉదయం 5.30 గంటలకు సుప్రభాత సేవ, శాత్తుమురై, వేద పారాయణం, నిత్య శేష హోమాలు, ఉదయం 9 గంటలకు సత్యనారాయణ స్వామివారి వ్రతములు, సాయంత్రం 6 గంటలకు విశ్వక్సేన ఆరాధన, రక్షాసూత్రధారణ, మత్స్యంగ్రహణం, వాస్తు యోగీశ్వర పూజలు, ప్రసాద వితరణ జరుగుతాయి. అదేవిధంగా 7వ తేదీన స్వామివారి వ్రతములు, గరుడ ధ్వజారోహణం, సాయంత్రం 5 గంటలకు ఎదుర్కోలోత్సవం, 5.30 గంటలకు శ్రీవారి కల్యాణోత్సవం, 8 గంటలకు శేష వాహనోత్సవం తదితర కార్యక్రమాలు జరుగుతాయి.



పూజలందుకుంటున్న కల్యాణ వేంకటేశ్వరుడు

నాలుగు కేజీల గంజాయితో వ్యక్తి అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న సీఐ

ఇచ్ఛాపురం టౌన్ : ఒడిశా నుంచి పూణేకు 4.18 కిలోల గంజాయి తరలిస్తున్న ఎలియా రైత అనే వ్యక్తిని గురువారం అరెస్టు చేసినట్టు సీఐ ఎం చిన్నంనాయుడు తెలిపారు. ఒడిశా రాష్ట్రం లుహకంటి గ్రామానికి చెందిన ఎలియా రైతా తన సోదరుడు జోహర్ రైతాతో కలిసి కుంజన ప్రాంతంలో గంజాయిని కొనుగోలు చేసి మహరాష్ట్రకు చెందిన రాఖేష్ సుదంప్లంజ్(చాచా)కు అమ్ముతుండేవారు. ఈ క్రమంలో ఎలియా రైతా రెండు ప్యాకెట్ల గంజాయితో బరంపురం నుంచి ఇచ్ఛాపురం వచ్చాడు. రైల్వేస్టేషన్ వద్ద పోలీసులు తనిఖీ చేయగా గంజాయి గుర్తించడంతో అరెస్ట్ చేసినట్టు సీఐ తెలిపారు.

అకడమిక్ అంశాలపై దృష్టి సారించండి

శ్రీకాకుళం న్యూకాలనీ: విద్యాప్రమాణాలను పెంపొందించేందుకు హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు విద్యాసంబంధిత అంశాలతోపాటు అకడమిక్ అంశాలపై దృష్టి సారించాలని డీఈఓ డాక్టర్ ఎస్.తిరుమల చైతన్య అన్నారు. శ్రీకాకుళం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అకడమిక్ అంశాలపై జరుగుతున్న జిల్లాస్థాయి డీఆర్పీల మూడు రోజుల శిక్షణా తరగతులు గురువారంతో ముగిశాయి. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ హెచ్‌ఎంలు, సబ్జెక్టు ఉపాధ్యాయులు అకడమిక్ అంశాలైన క్యాలెండర్, హ్యాండ్‌బుక్, అసెస్మెంట్, కరికులం వంటి అంశాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. రాష్ట్ర పరిశీలకులు గిరిజా శంకర్ మాట్లాడుతూ పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు మూడవ విడత ట్రైనింగ్‌లో ప్రతి హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు అకడమిక్ అంశాలపై శిక్షణ పొందాలన్నారు. ఈ నెల 9, 10, 11 తేదీలలో జిల్లాలో శ్రీకాకుళం, టెక్కలి, పలాస మూడు డివిజన్ల పరిధిలో ఉపాధ్యాయులకు తాజాగా శిక్షణ పొందిన డీఆర్పీలతో శిక్షణా తరగతులు ఉంటాయని పేర్కొన్నారు. హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులంతా హాజరుకావాల్సిందేనని స్పష్టంచేశారు. కార్యక్రమంలో కోర్స్ డైరెక్టర్, ఉప విద్యాశాఖ అధికారులు ఆర్. విజయకుమారి, పి.విలియం, డీసీఈబీ సెక్రటరీ జి.రాజేంద్రప్రసాద్, వమ్మరవల్లి డైట్ ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ ఎ.గౌరీశంకర్ తదితరులు పాల్గొన్నారు.



శిక్షణ పొందిన ఉపాధ్యాయుడికి ప్రశంసాపత్రాన్ని అందజేస్తున్న గిరిజాశంకర్, తిరుమల చైతన్య

ఇసుక తవ్వేస్తూ..
ప్రాణాలు తోడేస్తూ!



రామారావు అనే వ్యక్తి స్నానానికి దిగి ప్రాణాలు పోగొట్టుకున్నది ఇక్కడే..

- వంశధార నదిలో ఇష్టారాజ్యంగా ఇసుక తవ్వకాలు
- ఎక్కడికక్కడే భారీగా గోతులు
- ప్రమాదవశాత్తు మృత్యువాతపడుతున్న సామాన్యులు
- పట్టించుకోని అధికారులు



బెరి వద్ద వంశధార నదీలోకి నేరుగా వేసిన రోడ్డు ఇదే

శ్రీకాకుళం రూరల్: ఇసుక అక్రమార్కులు నిబంధనలకు తూట్లుపొడుస్తున్నారు. నదిలో ఇష్టారాజ్యంగా యంత్రాలతోనే భారీ ఎత్తున తవ్వకాలు చేస్తున్నా రు. ఫలితంగా పెద్ద పెద్ద గోతులు ఏర్పడుతున్నా యి. ఇటీవల కురిసిన వర్షాలతో పాటు ఎగువ ప్రాంతం నుంచి వస్తున్న నీరు ఆ గోతుల్లో చేరుతోంది. వాటిని గమనించని సామాన్యులు ప్రమాదవశా త్తు దిగి కూరుకుపోయి మృత్యువాతపడుతున్నారు. ఇలాంటి ఘటనే ఇటీవల శ్రీకాకుళం రూరల్ మండ ల పరిధిలో చోటు చేసుకుంది.

ఆదేశాలు బేఖాతరు..

వంశధార నదీ పరివాహక ప్రాంతాల్లో అనుమతులకు మించి తవ్వకాలు చేస్తున్నా అధికారులు మాత్రం ఎటువంటి చర్యలు చేపట్టడం లేదు. జిల్లా కలెక్టర్ సైతం అక్రమ తవ్వకాలపై కన్నెర్ర చేసినా రెవెన్యూ, మైన్స్ అధికారులు తమకేమీ పట్టనట్లే వ్యవహరిస్తున్నారు. బైరి, కరజాడ పరిసర ప్రాంతాల్లో పగలు రాత్రీ అనే తేడా లేకుండా ఇసుక దందా సాగుతోంది. నదిలో ఎక్కడికక్కడే భారీగా గోతులు తవ్వేస్తూ వదిలేస్తున్నారు. ఇప్పటికే ఇసుక తవ్వాలు నిత్యం చేపట్టడంతో వ్యవసాయ బోరులు సైతం పాడైపోయాయని పరిసర ప్రాంత రైతులు ఆవేదన చెందుతున్నారు. నదీ పరివాహక ప్రాంతంలో ఎక్కడికక్కడే తవ్వకాలు చేయడంతో గత నెలలో బైరి గ్రామానికి చెందిన గొర్లె రామారావు అనే వ్యక్తి వంశధార నదిలోకి స్నానానికి వెళ్లినప్పుడు భారీగా ఏర్పడిన గోతులో కూరుకుపోయి ప్రాణాలు పోగుట్టుకున్నాడు. ఇలాంటి గోతులే నదిలో ఎక్కడికక్కడ ఉన్నాయి. ఇంత జరుగుతున్నా రెవెన్యూ, మైన్స్ అధికారులు మాత్రం అక్రమ తవ్వకాలకు అడ్డుకట్ట వేయలేకపోతున్నారు. అనుమతులకు మించి తవ్వకాలు చేయడం, ఎక్కడికక్కడే గోతులు ఏర్పడటం వల్లే ఇటువంటి ప్రమాదాలు జరుగుతున్నాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గ్రానైట్ పలకలతో ఇసుక ర్యాంప్..

బైరి ర్యాంప్‌ను ఆనుకొని ఏకంగా నదీ గర్భంలోకే గ్రానైట్ పలకలతో కూడిన ర్యాంప్‌ను రోడ్డు మాదిరిగా వేసేశారు. దీని మీదుగా పెద్దపెద్ద వాహనాలు వెళ్తూ ఇసుక లోడింగ్ చేస్తున్నారు. నిబంధనల ప్రకారంలో కూలీలతో ట్రాక్టర్లకు ఇసుక నింపాల్సి ఉండగా 200 హైస్పీడ్‌తో కూడిన ప్రొక్లెయినర్లతో ఇక్కడ వినియోగిస్తున్నారు. ఫలితంగా నదీగర్భంలో ఎక్కడికక్కడే పెద్దపెద్ద గోతులు ఏర్పడి సామాన్యుల ప్రాణాలకు మీదకు వస్తోంది.

అనుమతులకు మించి తవ్వకాలు



బైరి గ్రామంలో అనుమతులకు మించి అక్రమంగా తవ్వకాలు చేయడంతో ఇటీవల మా గ్రామానికి చెందిన ఓ వ్యక్తి స్నానానికి దిగి చనిపోయాడు. అయినా తవ్వకాలు మాత్రం ఆగడం లేదు. నదీ పరివాహక ప్రాంతంలో ఏదో ఒక మూల తవ్వేస్తూ ఉన్నారు. అధికారులు గానీ, సచివాలయ సిబ్బంది గానీ ఎవ్వరూ పట్టించుకోవడం లేదు.

– ఎండి అసిరినాయుడు, ఉపసర్పంచ్, బైరి గ్రామం

తవ్వకాలు వాస్తవమే..

బైరి ప్రాంతంలో ఇసుక తవ్వకాలు నిత్యం జరుగుతున్నాయి. ఈ ర్యాంపును శ్రీ వెంకటేశ్వర మైనింగ్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ప్రతినిధులు నిర్వహిస్తున్నారు. నదిలోకి నేరుగా గ్రానైట్ పలకలతో కూడిన ర్యాంప్ వేశారు. ఇచ్చిన అనుమతులు కన్నా ఎక్కువగానే తవ్వేస్తున్నారు.

– శ్రీనివాసరావు, బైరి వీఆర్ఓ

క్లుప్తంగా

జాతీయ స్థాయి ప్రదర్శనలో గుంట్రెడ్డి కార్టూన్



గుంట్రెడ్డి భాస్కర రావు



జాతీయ స్థాయిలో ప్రదర్శించిన కార్టూన్

బొబ్బిలి: ప్రముఖ జాతీయ పత్రిక కార్టూన్ వాచ్ రాయపూర్‌లో గురువారం నిర్వహించిన జాతీయ స్థాయి కార్టూన్స్ ప్రదర్శనలో బొబ్బిలి పట్టణానికి చెందిన కార్టూనిస్ట్ గుంట్రెడ్డి భాస్కరరావు వేసిన కార్టూన్‌ను ప్రదర్శించారు. ప్లాస్టిక్ భూతంలో కూరుకు పోతున్న భూమిని పచ్చదనంతో రక్షించాలనే సందేశాన్నిస్తున్న ఈ కార్టూన్ పలువురి ప్రశంసలు పొందిందని భాస్కరరావు (భాను) ఈ సందర్భంగా తెలిపారు.

నాలుగు క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టివేత



ఆటోలో తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బంది

కొత్తవలస: ఆటోలో అక్రమంగా తరలిస్తున్న 4క్వింటాళ్ల ప్రజా పంపిణీ బియ్యాన్ని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ బి.సింహాచలం ఆధ్వర్యంలో గురువారం పట్టుకున్నారు. ఈ మేరకు సీఐ సింహాచలం మాట్లాడుతూ కొత్తవలస మండలంలోని వీరభద్ర పురం, దాసరివానిపాలెం గ్రామాల నుంచి ఆటోలో పీడీఎస్ బియ్యం అక్రమ రవాణా జరుగుతోందని వచ్చిన సమాచారం మేరకు ఆయా గ్రామాల పరిధిలో మాటువేసినట్లు చెప్పారు. దాసరివానిపాలెం గ్రామానికి చెందిన సత్యవరపు వెంకటబంగార్రాజు ఆటోలో 4వందల కేజీల బియ్యాన్ని తరలిస్తుండగా పట్టుకున్నామన్నారు. ఈ మేరకు నిందితుడిపై 6ఎ కేసు నమోదు చేసినట్లు పట్టుబడిన బియ్యాన్ని సీఎస్‌డీటీ రామకృష్ణకు అప్పగించినట్లు వివరించారు.

ముగ్గురి అరెస్ట్



సారాతో పట్టుబడిన వ్యక్తుల్ని చూపిస్తున్న కురుపాం ఎక్సైజ్ సీఐ శ్రీనివాసరావు, సిబ్బంది

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): సారా అక్రమ తయారీ, రవాణాను నిరోధించే కార్యక్రమంలో భాగంగా గురువారం చేపట్టిన దాడుల్లో ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసినట్లు కురుపాం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ పి.శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు కురుపాం ఎక్సైజ్ కార్యాలయం వద్ద విలేకరులతో సీఐ మాట్లాడుతూ జియ్యమ్మవలస మండలం చినమేరంగి గ్రామంలో స్టేట్‌టాస్క్ ఫోర్స్‌తో కలిసి దాడులు నిర్వహించగా 60 లీటర్ల సారాతో ఇద్దరు వ్యక్తులు పట్టుబడినట్లు చెప్పారు. అంతేకాకుండా గ్రామ పరిసరాల్లో పులియబెట్టిన 400 లీటర్ల బెల్లపు ఊటను గుర్తించి ధ్వంసం చేశామన్నారు. అలాగే సారా తయారీ సామగ్రిని అమ్మిన ఓ మహిళపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు. పై ముగ్గురినీ రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరు పరిచామన్నారు. గ్రామాల్లో సారా తయారీ రవాణా, అమ్మకాలు చేసి ప్రజల ఆరోగ్యానికి హాని కలిగిస్తే పీడీ యాక్ట్ ప్రయోగిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్సై జె.రాజశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

వ్యాధుల పట్ల అప్రమత్తం

సీతంపేట: ఎపిడమిక్ సీజన్ ఆరంభమైందని, వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని వైద్య సిబ్బందికి కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ సూచించారు. ఈ మేరకు గురువారం సీతంపేట ఏరియా ఆస్పత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. మలేరియా, వైరల్ ఫీవర్స్ తీవ్ర త, రోజువారీ ఓపీ, మందుల వివరాల గురించి సూపరింటెండెంట్ బి.శ్రీనివాసరావును అడిగి తెలుసుకున్నారు. రోగులకు సరిపోయే బెడ్స్ ఉన్నాయా? లేదా? అని పరిశీలించారు. ఆస్పత్రి అంతా కలియదిరిగి ప్రతి వార్డు, డాక్టర్ గదులు, మౌలిక వసతుల సదుపాయం గురించి తెలుసుకున్నారు. అదనపు భవనాలు నిర్మాణ దశలో ఉన్నందున రెండునెలల్లో పూర్తి చేయాలని సంబంధిత అధికారుల ను ఆదేశించారు. అనంతరం స్థానిక ప్రభుత్వ ఐటీఐని సందర్శించారు. జిల్లాలో నాలుగు నియోజకవర్గాల్లో స్కిల్ హబ్‌లను ఏర్పాటు చేశామని, యువత సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. నైపుణ్యాభివృద్ధి శిక్షణ ద్వారా యువతకు ఉపాధి కల్పించనున్నట్లు తెలిపారు.

మారిషస్ పైనాపిల్ క్షేత్రం పరిశీలన..

సీతంపేట మండలంలోని బిల్లగూడ గ్రామంలో మారిషస్ ఏర్పాటు చేసిన పైనాపిల్ పంట క్షేత్రాన్ని కలెక్టర్ పరిశీలించారు. మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉన్న రకం కాబట్టి గిరిజన ఉపప్రణాళిక పథకం కింద ఈ ఏడాది 358 మంది రైతులకు ఈ పైనాపిల్ పిలకలను సరఫరా చేశామన్నారు. రైతులకు ఆదా యం పెరగడంతో పాటు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని అభిప్రాయ పడ్డారు. మార్కెట్ సౌకర్యాలు బాగుంటాయని, విదేశాల్లో మన పైనాపిల్‌కు గిరాకి ఉందన్నారు. ఐటీడీఏ పీఓ సి.యశ్వంత్‌కుమార్‌రెడ్డి, ఏపీవో చిన్నబాబు పాల్గొన్నారు.

ఏదీ నా చిరునామా?



పొనుగుటివలస ఏరియల్ వ్యూ

ఆ గ్రామానికి ఓ చిరునామా అంటూ లేకుండా పోయింది. ఏళ్లు గడుస్తున్నా ఆ గ్రామాన్ని ఎవరూ పట్టించుకోవడం లేదు. రెండు మండలాల మధ్య ఆ గ్రామ ప్రజలు నలిగిపోతున్నారు. ఒక్క మండలంలో ఉన్న ప్రజలకే సరిగా పనులు జరగని పరిస్థితుల్లో రెండు మండలాల అధికారుల చుట్టూ ఆ గ్రామ ప్రజలు తిరగక తప్పడం లేదు. ఇదీ సంతకవిటి మండలంలోని పొనుగుటి వలస గ్రామస్తుల దుస్థితి.

– రాజాం సిటీ

- రెండు మండలాల మధ్య నలిగిపోతున్న గ్రామం
- పట్టించుకునే నాథుడే కరువు
- అవస్థలు పడుతున్న గ్రామస్తులు

సుమారు ఐదువేల జనాభా ఉన్న గ్రామం అది. పాలకులు.. ప్రభుత్వాలు మారుతున్నా ఆ గ్రామాన్ని ఎవరూ పట్టించుకోవడంలేదు. ఓ పక్క నగరీకరణ, ఆధునికీకరణ, పాశ్చాత్యపోకడలకు అలవాటు పడి పల్లెలు సైతం అభివృద్ధి బాటలో పయనిస్తుంటే నేటికి సుమారు 20 ఏళ్లు గడుస్తున్నా ఆ గ్రామం మాత్రం అభివృద్ధికి ఆమడదూరంలోనే ఉంది. దీంతో తమ మొర జిల్లా అధికారులకు చెప్పుకోవాలో? మండల అధికారులకు చెప్పుకోవాలో? తెలియక గ్రామస్తులు సతమతమవుతున్నారు.

ఎటూ కాకుండా పోతూ..

2005లో రాజాం మండలంలోని రాజాం, సారధి మేజర్ పంచాయతీలతో పాటు కొత్తవలస, కొండంపేట, సంతకవిటి మండలంలోని పొనుగుటివలస గ్రామాలను కలుపుతూ నగరపంచాయతీగా ఏర్పాటుచేశారు. (2020లో థర్డ్‌గ్రేడ్ మున్సిపాల్టీగా రాజాంను అప్‌గ్రేడ్ చేశారు) అప్పటికే ఈ పంచాయతీలకు సర్పంచ్‌లుగా ఉన్నవారి పదవీకాలం ముగియకపోవడంతో వారు కోర్టును ఆశ్రయించారు. దీంతో నగరపంచాయతీ ఏర్పడినప్పటికీ మిగతా పనులు ఎక్కడివక్కడే మిగిలిపోయాయి. దీంతో సంతకవిటి మండలంలో భాగమైన పొనుగుటివలస రెవెన్యూ, పంచాయతీ రికార్డులు నగరపంచాయతీకి అప్పగించకుండా సంతకవిటి మండలంలోనే ఉండిపోయాయి. అప్పటి నుంచి ప్రతి పనికి మున్సిపాల్టీకి వెళ్తే సంతకవిటి మండలానికి వెళ్లాలని, సంతకవిటి వెళ్తే నగరపంచాయతీకే వెళ్లాలని అధికారులు చెబుతుండడంతో చేసేదిలేక అటూ ఇటూ తిరుగుతూ ఏదో విధంగా పనులను మమ అనిపిస్తున్నారు. ముఖ్యంగా రెవెన్యూ, పోలీసు శాఖల విషయంలో ప్రజలకు ఎక్కువ సమస్యలు తలెత్తుతున్నాయి.

గతంలో ఉన్న పేరు..నేడు మాయం..

రాజాం పట్టణానికి కూతవేటు దూరంలో ఉన్న ఆ గ్రామం అభివృద్ధికి నోచుకోక అనామకురాలిలా మిగిలిపోయింది. గ్రామంలో పది సాగునీటి చెరువులు ఉన్నాయి. అవన్నీ ఇప్పుడు పూడికలు, తుప్పలతో అధ్వానంగా తయారయ్యాయి. మూడు దశాబ్దాల వెనక్కి వెళ్తే గ్రామంలో ఒక కోనేరు ఉంది. దాని నీటిని తాగడంతో పాటు వాడకానికి గ్రామస్తులు వినియోగించేవారు. ఐదేళ్ల క్రితం వరకు కోనేరు బాగానే ఉండేది. తరువాత అది పూర్తిగా పాడైపోవడంతో గ్రామ ప్రజలు అధికారుల వద్ద మొరపెట్టుకున్నా లాభం లేకుండా పోయింది. దీంతో చలించిన గ్రామ యువకులు అంతా కలిసి చెరువును బాగుచేసేందుకు సుమారు రూ. 26 లక్షల వరకు చందాలు వేసుకుని బాగుచేయించారు. అలాగే సాగునీటి చెరువులు తుప్పలు, పిచ్చిమొక్కలతో దర్శనమిస్తున్నాయి. నీటి నిల్వసామర్థ్యం ఉన్నప్పటికీ సరిగా వినియోగంలోకి రాకుండా పోయాయి. ఈ గ్రామం రాజాం నగరపంచాయతీలో విలీనమైన తరువాత ఏడాది నుంచి గ్రామీణ ఉపాధిహామీ పథకాన్ని కేంద్రప్రభుత్వం అమలు చేసింది. కనీసం గ్రామీణ ప్రాంతం అయి ఉంటే ప్రతి ఏడాది ఉపాధి పనులతో వాటిని బాగుచేసుకునే వీలుండేది. అన్ని సాగునీటి చెరువులకు మదుములు పాడవడంతో రైతులు సొంతంగా బాగుచేసుకోవడమే తప్ప అధికారులెవరూ పట్టించుకున్న దాఖలాలు లేవు. ఇదిలా ఉండగా గ్రామానికి తూర్పు భాగాన రెండు ఎకరాల వరకు శ్మశాన స్థలం ఉంది. అది ఇప్పుడు కుచించుకుపోయి శ్మశానానికి కూడా వెళ్లేందుకు సరైన రహదారి సౌకర్యం కూడా లేకుండా పోయింది. ఈ విషయంపై ఎవరికి ఫిర్యాదు చేయాలో అర్థంకాక గ్రామస్తులు తలలు పట్టుకుంటున్నారు. వ్యవసాయ, రెవెన్యూ, పోలీస్, విద్య, ఇరిగేషన్ వంటి ముఖ్యమైన శాఖలు సంతకవిటి మండలంలో ఉండిపోవడంతో మరిన్ని ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ప్రస్తుతం రైతు భరోసా కేంద్రం కూడా లేకపోవడంతో మరో గ్రామం వెళ్లి అక్కడి రైతుల తదనంతరం వ్యవసాయ సంబంధిత విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు తదితరాల కోసం ఈ గ్రామ రైతులు నమోదు చేసుకోవాల్సి వస్తోంది. ఒక గ్రామానికి సంబంధించి ఎన్ని శాఖలు ఉంటాయో అన్ని శాఖల సేవలు అందించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు వేడుకుంటున్నారు.



గ్రామయువకులు బాగుచేయించిన కోనేరు



దయనీయంగా మారిన సాగునీటి చెరువు



తుప్పలతో దర్శనమిస్తున్న శ్మశానం

అధ్వానంగా సాగునీటి చెరువులు..



గ్రామంలోని పంటపొలాలన్నీ సాగునీటి చెరువులపైనే ఆధారపడి ఉన్నాయి. గ్రామ ఆయకట్టుకు సుమారు ఎనిమిది సాగునీటి చెరువులు ఉన్నాయి. అన్ని చెరువులు తుప్పలు పేరుకుపోయి, మదుములు పాడై పోయి ఉన్నాయి. వ్యవసాయ పనుల సమయంలో చెరువుల నిండుగా నీరున్నా ఇంజిన్ల సహాయంతో తడులు పెట్టాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. దీనికితోడు సాగునీటి కాలువలు కూడా పూడుకుపోతున్నాయి. ఏ అధికారి వద్ద చెరువుల పరిస్థితిని చెప్పుకోవాలో తెలియడంలేదు.

ఎం.వెంకటినాయుడు, రైతు, పొనుగుటివలస

తప్పని ఇబ్బందులు..



కూత వేటు దూరంలో ఉన్న రాజాంలో 2005లో మా గ్రామాన్ని విలీనం చేశారు. పోలీస్‌స్టేషన్ మాత్రం సంతకవిటి పరిధిలో ఉంది. దీంతో ఆయా సమయాల్లో పోలీస్‌స్టేషన్, రెవెన్యూ కార్యాలయం పనులకు వెళ్లాలంటే ఇబ్బందులు పడాల్సి వస్తోంది. 16 కిలోమీటర్ల దూరంలో ఉన్న సంతకవిటి కంటే రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న రాజాంలో మా గ్రామాన్ని విలీనం చేస్తే అన్ని విధాలుగా సౌకర్యంగా ఉంటుంది.

రెడ్డి మహేష్, గ్రామస్తుడు

అన్నీ సమస్యలే..



గ్రామంలో ఏ సమస్య వచ్చినా గతంలో ఒక మండలానికి సంబంధించిన అధికారులకు చెప్పుకునేవాళ్లం. ఇప్పుడు ఎవరికి చెప్పుకోవాలో తెలియడం లేదు. మంచినీటి కోనేరు నుంచి శ్మశానం వరకు ఉన్న సమస్యలను అధికారులు తీరుస్తారని ఎదురుచూడడమే మిగులుతోంది.

జిల్ల కృష్ణ, గ్రామస్తుడు

బొలెరోను ఢీకొట్టిన బైక్: ఒకరి మృతి

- మరో ఇద్దరికి తీవ్రగాయాలు



చిన్నారావు మృతదేహం

విజయనగరం క్రైమ్: నగరంలోని ఆర్టీఓ ఆఫీస్ వద్ద గురువారం బొలెరో వాహనాన్ని బైక్ ఢీ కొట్టిన ఘటనలో ఓ వ్యక్తి మృతి చెందాడు. మరో ఇద్దరు గాయాలపాలయ్యారు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలను వన్‌టౌన్ సీఐ శ్రీనివాస్ తెలియజేశారు. కొండకరకాం గ్రామానికి చెందిన ప్రమోద్, చిన్నారావు, సునీల్ బుల్లెట్‌పై విజయనగరంలో పని చూసుకుని తిరిగి గ్రామానికి వెళ్తున్న క్రమంలో ఆర్టీఓ ఆఫీస్ వద్ద ఓ బొలెరో వాహనం అకస్మాత్తుగా రోడ్డుపైకి వస్తుండగా త్రిబుల్ రైడింగ్ చేస్తున్న ఈ ముగ్గురు బైక్‌తో ఢీకొట్టారు. దీంతో బైక్‌పై ఉన్న ముగ్గురిలో చిన్నారావు కింద పడిపోగా మిగిలిన ఇద్దరూ పక్కకు పడిపోయారు. చిన్నారావుకు మాత్రం శరీరం మధ్యభాగంలో తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే 108కి సమాచారం ఇవ్వగా గాయపడిన వ్యక్తులను తిరుమల మెడికవర్‌కు చికిత్స కోసం తరలించారు. తీవ్రంగా గాయపడిన చిన్నారావు చికిత్స పొందుతూ మృతి చెందాడు. మిగిలిన ఇద్దరూ చికిత్స పొందుతున్నారు. ఈ ఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

రొటోవేటర్ కిందపడి వ్యక్తి దుర్మరణం



రామారావు (ఫైల్)



రామారావు మృతదేహం

సీతానగరం: మండలంలోని కామందొరవలసలో గురువారం ట్రాక్టర్‌తో దుక్కి చేస్తున్న సమయంలో రొటోవేటర్‌కు ఉన్న గడ్డి తీస్తుండగా ఓ వ్యక్తి దుర్మరణం చెందాడు. ఈ సంఘటనపై పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కామన్న దొరవలస గ్రామానికి చెందిన బురిడి రామారావు(46) తన పొలంలో దుక్కిదున్నే నిమిత్తం ట్రాక్టర్‌ను రప్పించుకున్నాడు. ఆ ట్రాక్టర్ వెనుకనున్న రొటోవేటర్‌కు తగిలిన గడ్డిని తీయమని ట్రాక్టర్ డ్రైవర్ రామారావుకు సూచించడంతో రామారావు రొటోవేటర్ గడ్డి తీస్తుండగా డ్రైవర్ నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేయడంతో రొటోవేటర్‌కున్న బ్లేడ్‌లు ఆయన ఛాతీపైన బలంగా తగలడంతో కిందపడి మృతిచెందాడు. ఈ సంఘటనపై మృతుడి కుమారుడు తిలక్‌కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్రాస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై ఎం. రాజేష్ తెలియజేశారు. మృతుడికి తల్లి, భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కొత్తవలస: అరకు-విశాఖపట్నం జాతీయ రహదారిలో కొత్తవలస మండలంలోని తాడివానిపాలెం గ్రామం సమీపంలో ఈ నెల రెండవ తేదీన జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన జి.వెంకటరమణ (63) చికిత్స పొందుతూ గురువారం మృతి చెందారు. కొత్తవలసలోని వసంత్‌విహార్ ప్రాంతానికి చెందిన వెంకటరమణ విశాఖపట్నంలో గల కూతురి ఇంటికి ద్విచక్రవాహనంపై వెళ్లి తిరిగి వస్తుండగా తాడివానిపాలెం వద్ద ఎదురుగా వస్తున్న ఆర్‌టీసీ బస్సును తప్పించబోయి పక్కనే గల చెట్టును బలంగా ఢీకొట్టారు. దీంతో తీవ్ర గాయాల పాలైన ఆయనను 108 వాహనంలో విశాఖపట్నంలో గల ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్సపొందుతూ మృతిచెందారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పుట్టినరోజుకు మూడు రోజుల ముందు ప్రమాదం

- బైక్‌ను లారీ ఢీకొట్టడంతో యువకుడి మృతి



కస్తూరి సాయి మృతదేహం

రామభద్రపురం: మరో మూడు రోజుల్లో పుట్టిన రోజు జరుపుకోవాల్సిన ఓ యువకుడు అనంత వాయువుల్లో కలిసిపోయాడు. ఈ దుర్ఘటన వివరాలిలా ఉన్నాయి. రామభద్రపురం మండల పరిధిలోని రొంపల్లివలస వద్ద ద్విచక్రవాహనాన్ని లారీ ఢీ కొనడంతో జరిగిన ప్రమాదంలో ఓ యువకుడు దుర్మరణం చెందాడు. దత్తిరాజేరు మండల పోలీస్‌స్టేషన్ బూర్జవలస గ్రామానికి చెందిన కస్తూరి సాయి (21) పనినిమిత్తం రామభద్రపురం మండలంలోని ఆరికతోట గ్రామానికి వచ్చాడు. పని ముగించుకుని తిరిగి బూర్జవలసలోని ఇంటికి బైక్‌పై వెళ్తుండగా విజయనగరం నుంచి ఎదురుగా వస్తున్న లారీ బలంగా ఢీ కొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ప్రమాద సమాచారం తెలిసిన వెంటనే ఎస్సై వి.ప్రసాదరావు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించి ప్రమాద వివరాలు తెలుసుకున్నారు. మృతుడి తండ్రి ప్రభాకర్ ఫిర్యాదు మేరకు ఎస్సై ప్రసాదరావు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మరో మూడు రోజుల్లో పుట్టిన రోజు చేసుకోవాల్సిన కుమారుడు హఠాత్తుగా రోడ్డు ప్రమాదంలో మృతిచెందడంతో తల్లిదండ్రులు ప్రభాకర్, లక్ష్మి, ఇతర కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

పెళ్లి వేడుకకు వచ్చి పరలోకానికి..



అజిత్‌కుమార్ (ఫైల్)

జి.సిగడాం: స్నేహితుడి సోదరి వివాహ వేడుకకు వచ్చిన ఓ యువకుడు బావిలో దిగి ఈతరాక మృత్యువాతపడ్డాడు. ఈ విషాద ఘటన జి.సిగడాం మండలం పెంట గ్రామంలో బుధవారం సాయంత్రం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పార్వతీపురం మన్యం జిల్లా సాలూరు మండల కేంద్రానికి చెందిన దుగ్గాన అజిత్‌కుమార్(19) విజయవాడ కేఎల్ యూనివర్సిటీలో బీటెక్ చదువుతున్నాడు. ఇటీవలే ప్రథమ సంవత్సరం పరీక్షలు రాసి సెలవులకు సాలూరు వచ్చాడు. తన స్నేహితుడు తామాడ మహేష్ సోదరి పెళ్లి వేడుక కోసం స్నేహితులు తామాడ మహేష్, చిట్టివలస కుమార్, రాజుతో ఈ నెల 4న సంతకవిటి మండలం మామిడిపల్లి వచ్చారు. సాయంత్రం పూట అందరూ బయటకు వచ్చి జి.సిగడాం మండలం పెంట గ్రామంలో నేల బావి వద్దకు వెళ్లారు. ముందుగా అజిత్‌కుమార్ బావిలో దిగి ఈత రాకపోవడంతో మునిగిపోయాడు. వెంటనే స్నేహితులు బావిలో దిగి రక్షించే ప్రయత్నం చేయగా సాధ్యం కాకపోవడంతో గ్రామస్తులకు సమాచారం అందించారు. స్థానికులు హుటాహుటిన బావి వద్దకు చేరుకుని బయటకు తీసేసరికే అజిత్‌కుమార్ మృతిచెందాడు. సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. మృతుడి తల్లి సుజాత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ వై.మధుసూదనరావు గురువారం తెలిపారు. వీఆర్‌ఓ భూపతి నర్సింగరావు, వీఆర్‌ఏ బాలకృష్ణ సమక్షంలో శవపంచనామా అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజాం సామాజిక ఆస్పత్రికి తరలించారు.

మొక్కలతో వాతావరణంలో సమతుల్యం

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం. బబిత



జిల్లా న్యాయస్థానాల సముదాయంలో మొక్కలు నాటిన ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎం.బబిత, తదితరులు

విజయనగరం లీగల్: ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఈ సంవత్సరం ప్లాస్టిక్‌తో ముప్పు అనే నినాదంతో ప్రజలకు విస్తృత అవగాహన కల్పిస్తున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎం.బబిత అన్నారు. ఈ మేరకు ప్రపంచపర్యావరణ దినోత్సవం సందర్భంగా జిల్లా న్యాయస్థానాల సముదాయంలో ఆమె గురువారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలందరూ ప్లాస్టిక్ వినియోగం తగ్గేలా చూడాల్సిన అవసరం ఉందన్నారు. 70 మైక్రాన్ల కన్నా ఎక్కువ పరిమాణంతో కూడిన ప్లాస్టిక్ బ్యాగులు వాడితే పర్యావరణానికి ముప్పు వాటిల్లుతుందని అందువల్ల ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయంగా స్టీల్‌గ్లాసులు, స్టీల్ బాటిల్స్, కాటన్ బ్యాగులు ఉపయోగించాలని కోరారు. మొక్కలు ఎక్కువగా నాటడం వల్ల వాతావరణం సమతుల్యంగా ఉంటుందని ఈ సందర్భంగా గుర్తు చేస్తూ ప్రజలందరూ ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా నాల్గవ అదనపు జడ్జి బి.అప్పలస్వామి, ఐదవ అదనపు జడ్జి ఎస్.పద్మావతి, సీనియర్ సివిల్ జడ్జి బీహెచ్‌వీ లక్ష్మీకుమారి, జిల్లా న్యాయ సేవా సాధికార సంస్థ సెక్రటరీ ఎ.కృష్ణప్రసాద్, మొబైల్ కోర్టు జడ్జి బుజ్జి, స్థానిక న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు కె.రవిబాబు, న్యాయమూర్తులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ కాలుష్యాన్ని కలిసికట్టుగా నిర్మూలిద్దాం

విజయనగరం: ప్లాస్టిక్ కాలుష్యాన్ని నిర్మూలించడంలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని కలెక్టర్ డా.బీఆర్.అంబేడ్కర్ పిలుపునిచ్చారు. మానవుల జీవన సరళిలో పర్యావరణానికి హాని చేసే వాటిని నిర్మూలించాలని తద్వారా పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలని కోరారు. ఈ మేరకు గురువారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యం లో జరిగిన వర్క్‌షాప్‌లో కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. అంతకు ముందు నగరంలోని అంబేడ్కర్ కూడలి నుంచి జిల్లా పరిషత్ వరకు ప్లాస్టిక్‌ను నిర్మూలిద్దాం అనే నినాదం తో పెద్దఎత్తున ర్యాలీ నిర్వహించారు. ప్రతి గ్రామంలో, మండలంలో, జిల్లాస్థాయిలో ప్రజలకు ప్లాస్టిక్ వ్యర్థాల వినియోగం వల్ల కలిగే నష్టాల గురించి అవగాహన కలిగించాలని, వచ్చే ఏడాది ఈ తేదీ నాటికి జిల్లా పర్యావరణంలో స్పష్టమైన మార్పు కనపడాలని, ప్రతి ఒక్కరూ సామజిక బాధ్యతగా భావించి పర్యావరణానికి ప్రాణం పోయాలని కలెక్టర్ ఈ సందర్భంగా కోరారు. కార్యక్రమంలో పాల్గొన్న కార్పొరేషన్ కమిషనర్ నల్లనయ్య మాట్లాడుతూ నగరంలో ప్లాస్టిక్‌పై యుద్ధాన్ని ప్రకటిస్తున్నామని, దుకాణాలపై దాడులు చేసి ఎక్కడా ప్లాస్టిక్ వినియోగం లేకుండా చూస్తున్నామన్నారు. నగరంలో 15 వేల వరకు మొక్కలు నాటుతున్నట్లు తెలిపారు.

జిల్లా అటవీ అధికారి కొండలరావు మాట్లాడుతూ జనాభా పెరుగుదల వల్ల పర్యావరణం దెబ్బ తింటోందని, దీని పరిణామాలు భవిష్యత్తు వారికీ నష్టం కలిగిస్తాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రకృతికి దగ్గరగా మానవుడు ఉండాలని, ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలని కోరారు. ఒక్కరోజే 4 లక్షల మొక్కల్ని జిల్లాలో నాటడం ద్వారా పర్యావరణాన్ని పరిరక్షించడానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా కాలుష్య నియంత్రణ మండలి ముద్రించిన పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం ప్రతి మూడవ శనివారం స్వచ్ఛాంధ్ర కార్యక్రమాల్లో పాల్గొంటూ పారిశుధ్య కార్యక్రమాలను నిర్వహిస్తున్న ఉత్తమ కంపెనీలైన ఎంఎస్ఎం ఫార్మా, శారద మెటల్, అంజన ఫెర్రో ఎల్లాయిస్ కంపెనీల ప్రతినిధులకు కలెక్టర్ అంబేడ్కర్ ప్రశంసాపూర్వకంగా మెమెంటోలు అందజేశారు. కార్యక్రమంలో కాలుష్య నియంత్రణ మండలి ఈఈ సరిత, జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓ వెంకట రమణ, ప్రొఫెసర్ రామకృష్ణ, పలు పరిశ్రమలకు చెందిన ఉద్యోగులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జిల్లాలో నాలుగు లక్షలు మొక్కలు నాటడమే లక్ష్యం

నెల్లిమర్ల రూరల్: వనమహోత్సవం కార్యక్రమం ద్వారా ఈ ఏడాది జిల్లాలో నాలుగు లక్షలు మొక్కలు నాటాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించిందని కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ తెలిపారు. ఈ మేరకు నెల్లిమర్ల మండలంలోని కొండవెలగాడ నగరవనంలో 4లక్షల మొక్కలు నాటే కార్యాక్రమానికి స్థానిక ఎమ్మెల్యే లోకం నాగమాధవితో కలిసి గురువారం ఆయన శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతిరోజూ ప్రతి వ్యక్తి ఒక మొక్కను నాటి సంరక్షణ బాధ్యతలు తీసుకుంటే జిల్లాలో పచ్చదనం నిండుతుందన్నారు. పర్యావరణానికి ఆరోగ్యానికి సంబంధం ఉందని, పర్యావరణాన్ని సంరక్షిస్తే అది మనల్ని కాపాడుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా అటవీ అధికారి కొండలరావు, ఇన్‌చార్జ్ ఆర్డీఓ సవరమ్మ, డీఎంహెచ్‌ఓ జీవనరాణి, స్థానిక అధికారులు పాల్గొన్నారు.

విజయవంతం చేసినందుకు కృతజ్ఞతలు



పీడిక రాజన్నదొర

సాలూరు: వైఎస్సార్‌సీపీ అధినేత జగన్ మోహన్ రెడ్డి పిలుపు మేరకు ఈనెల 4న నిర్వహించిన వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని విజయవంతం చేసిన సాలూరు నియోజకవర్గ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులకు మాజీ డిప్యూటీ సీఎం రాజన్నదొర కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తున్నా ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడంతో చేపట్టిన నిరసన ర్యాలీని ఊహకందని రీతిలో ప్రజలు విజయవంతం చేశార న్నారు. భవిష్యత్‌లో ప్రజావ్యతిరేక విధానాలపై చేపట్టనున్న పోరాటానికి ఇదే తరహాలో ప్రజలు సహకరించాలని రాజన్నదొర విజ్ఞప్తి చేశారు.

జిల్లాకు రెండు మోడ్రన్ డ్రోన్స్

- పరిశీలించిన ఎస్పీ వకుల్ జిందల్



కొత్తగా వచ్చిన డ్రోన్స్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ వకుల్ జిందల్

విజయనగరం క్రైమ్: జిల్లాలో నిర్వహించే సభలు, సమావేశాలు, జాతర్లలో మరింత నిఘా ఏర్పాటుకు ప్రత్యేకంగా రూపొందించిన రెండు టెథర్డ్ డ్రోన్స్‌ను రాష్ట్ర పోలీసు శాఖ జిల్లాకు మంజూరు చేసిందని ఎస్పీ వకుల్ జిందల్ తెలిపారు. సాధారణ డ్రోన్స్‌కు భిన్నంగా, ప్రత్యేక అవసరాలకు కోసం రూపొందించిన టెథర్డ్ డ్రోన్ పని తీరును గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ పరిశీలించారు. ఒక నిర్దిష్ట ప్రదేశాల్లో నిర్వహించే సభలు, సమావేశాలు, జాతర్లలో మరింత నిఘాను ఏర్పాటు చేసేందుకు టెథర్డ్ డ్రోన్ ఎంతగానో ఉపయోగపడుతుందని ఎస్పీ ఈ సందర్భంగా చెప్పారు. సుమారు 10గంటలపాటు గాలిలో తేలుతూ ఒక నిర్దిష్ట ప్రదేశంలో జరిగే కార్యకలాపాలపై నిఘా ఏర్పాటు చేసే సామర్థ్యం కలిగి ఉంటుందన్నారు. ఎలక్ట్రిక్ పవర్ లేదా జనరేటర్ సహాయంతో ఒక కేబుల్ ఆధారంగా డ్రోన్ పని చేస్తుందని తెలిపారు. జీపీఎస్ అవాంతరాలు ఉన్న ప్రదేశాల్లో కూడా ఈ డ్రోన్ పని చేసే సామర్థ్యంతో పాటు అదనంగా పబ్లిక్ అడ్రస్ సిస్టం, డే/నైట్ విజన్ కెమెరా, ఏఐ కెమెరాలను కలిగి ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎస్పీ సీఐలు ఆర్వీఆర్కే చౌదరి, ఏవీ లీలారావు, డ్రోన్ పైలట్స్ నరేష్, వెంకటేష్, ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ కనబరచాలి

- ఐటీడీఏ పీఓ శ్రీవాత్సవ

పార్వతీపురం: పార్వతీపురం ఐటీడీఏ పరిధిలో ఉన్న గిరిజన సంక్షేమ పాఠశాలల్లో చదివే విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని ప్రాజెక్టు అధికారి అశుతోష్ శ్రీవాత్సవ అన్నారు. ఈ మేరకు గురువారం ఆయన గిరిమిత్ర సమావేశ మందిరంలో గిరిజన ఆశ్రమ పాఠశాలలు, గురుకులాలు, ఏకలవ్య మోడల్ స్కూల్స్, ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాల్స్, వసతిగృహ సంక్షేమ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అన్ని గిరిజన సంక్షేమ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు డ్రైవ్ కార్యక్రమాన్ని చేపట్టాలని సూచించారు. పాఠశాల ప్రాంగణాలను శుభ్రపరచడం, తరగతి గదుల నిర్వహణ, చిన్నపాటి మరమ్మతులు చేపట్టడం, అన్ని ఐటీ పరికరాలు సరిగ్గా పనిచేసేలా చూసుకోవడం, నీటి ట్యాంకులను శుభ్రపరచడం వంటి పనులకు సంబంధించి పాఠశాల సంసిద్ధతపై కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని ఆదేశించారు. పాఠశాలల అధిపతులందరూ విద్యార్థుల ఆరోగ్య కార్డులను నిర్వహించాలని, అనారోగ్యంతో ఉన్న బోర్డింగ్ విద్యార్థులను వారు పూర్తిగా కోలుకునే వరకు లేదా చికిత్స పూర్తిచేసే వరకు ఇంటికి పంపకూడదని స్పష్టం చేశారు.